క్లుప్తంగా

కేంద్ర మంత్రికి అభినందనలు



బండి సంజయ్‌తో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేష్‌గౌడ్

దుబ్బాకటౌన్: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని ఢిల్లీలో దుబ్బాకకు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేష్ గౌడ్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కరీంనగర్ ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్నందుకు అభినందనలు తెలిపారు.

ఎంపీని కలిసిన బీజేపీ నేతలు

తొగుట(దుబ్బాక): మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావును ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు బీజేపీ మండల నాయకులు తెలిపారు. మెదక్ పార్లమెంట్ సభ్యుడిగా మంగళవారం ప్రమాణస్వీకారం చేయడంతో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూరెడ్డి విభీషణ్‌రెడ్డి ఆధ్వర్యంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారన్నారు. కార్యక్రమంలో చందాపూర్ మాజీ సర్పంచ్ నర్సింహులు, మాజీ ఉప సర్పంచ్‌లు శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌గౌడ్, కల్యాణ్‌దాస్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

దుబ్బాకరూరల్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ గంగరాజ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చీకోడ్ గ్రామంలో సోమవారం రాత్రి 11 గంటల సమయంలో పది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని యాదగిరి బోలెరో ఆటోలో చీకోడ్ నుంచి రాజన్న సిరిసిల్లా జిల్లా ముస్తాబాద్ మండలానికి తరలిస్తున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా రేషన్ బియ్యంగా గుర్తించారు. వాహనాన్ని సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని పౌరసరఫరాల అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పంటలు కాపాడేందుకు రైతుల తంటాలు

కోహెడరూరల్(హుస్నాబాద్): పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా తంటలు పడుతున్నారు. వర్షాలు కురుస్తాయన్న ఆశతో ముందస్తుగా పత్తి విత్తనాలు నాటినవారు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలానికి ముందుగా కురిసిన వర్షానికి కోహెడ మండలంలో విత్తనాలు వేశారు. సరిపడా వర్షాలు పడక పంటలు ఎండిపోతున్నాయి. బోర్లు, బావులు ఉన్న వారు స్ప్రింక్లర్ల ద్వారా నీటి తడులు అందిస్తూ మొలకలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. మండలంలోని వింజపల్లి గ్రామ శివారులోని ఓ రైతు స్ప్రింక్లర్ల ద్వారా పత్తి మొలకలకు నీటి తడులందిస్తున్నాడు.

డిగ్రీ ప్రవేశాలకు ఆహ్వానం

హుస్నాబాద్: హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సువిశాలమైన కళాశాల భవనం, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, కంప్యూటర్ ల్యాబ్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, బోటనీ, జువాలజీ సైన్స్ ల్యాబ్‌లు, లైబ్రరీ, విశాలమైన ఆట స్థలం ఉన్నాయని తెలిపారు. కళాశాలలో చేరిన వారికి స్కాలర్‌షిప్, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. దోస్త్ వెబ్‌సైట్, దోస్త్ మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 30వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకొని ప్రాధాన్యత ప్రకారం కళాశాల వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని సూచించారు.

మహిళా శక్తిపై అవగాహన

హుస్నాబాద్‌రూరల్: మహిళలకు స్వయం ఉపాధి కల్పించి వారు ఆర్థికాభివృద్ధి సాధించడానికి మహిళా శక్తి కార్యక్రమంతో ప్రభుత్వం ముందుకు వస్తుందని ఏపీఎం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఐకేపీ కార్యాలయంలో సీఏ, గ్రామ సమైక్య అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం తెస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలతో స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సమావేశంలో సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

బడికి తాళం వేస్తా

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కుందనవానిపల్లిలో 'మన ఊరు- మన బడి'కార్యక్రమంలో పాఠశాలలో చేపట్టిన మరమ్మతులు, ప్రహరీ నిర్మాణం తదితర పనులకు రూ.9 లక్షల బిల్లులు రావల్సి ఉందని, వారంలోగా చెల్లించకపోతే బడికి తాళం వేస్తానని గ్రామ మాజీ సర్పంచ్ అన్నాడి దినేష్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అనేకమార్లు బిల్లులు చెల్లించాలని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే తనకు ఆత్మహత్యే శరణ్యమని పేర్కొన్నాడు.

నిరుపయోగంగా క్రీడా మైదానాలు

- కానరాని వసతులు
- సర్కారు బడుల్లో, ఊరికి దూరంగా ఏర్పాటు
- బోర్డులతో సరిపెడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు



దుబ్బాకలో వసతులు లేక వెలవెల బోతున్న క్రీడా ప్రాంగణం

దుబ్బాకటౌన్: యువతను క్రీడల్లో ప్రోత్సహించి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. కానీ, క్షేత్ర స్థాయిలో వసతులు లేక అవి వెలవెల బోతున్నాయి. పేరుకే అన్నట్లుగా బోర్డులతో దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల మొరం వేసి చదును చేస్తే మరికొన్ని చోట్ల బోర్డులు పెట్టి మమ అనిపించారు. జిల్లాలో చాలా చోట్ల సర్కారు బడులు, ఊరికి దూరంగా ఏర్పాటు చేయడంతో యువత వాటిని ఉపయోగించుకోక పోవడంతో నిరుపయోగంగా మారి ముళ్ల పొదలతో నిండిపోయాయి.

దుబ్బాక పట్టణంలో..

దుబ్బాక మున్సిపల్ పరిధిలో కేవలం రెండు క్రీడా ప్రాంగణాలను మాత్రమే నిర్మించారు. ఒక్కో క్రీడా ప్రాంగణానికి దాదాపు రూ.5 లక్షలు ఖర్చు చేశారు. ఓ క్రీడా ప్రాంగణం ఊరికి దూరంగా ఉండటం, మరో క్రీడా ప్రాంగణంలో వసతులు లేక పోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి.

జిల్లాలో 467 క్రీడా ప్రాంగణాలు

జిల్లా వ్యాప్తంగా 499 గ్రామ పంచాయతీల్లో 467 క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. ఒక్కో క్రీడా ప్రాంగణానికి దాదాపు రూ. 75 వేలు వెచ్చించారు. క్రీడా ప్రాంగణాల్లో కనీసం ఐదారు ఆటలు ఆడేలా స్థలం ఉండాలి. కానీ, స్థల సేకరణ సరిగ్గా చేయకపోవడంతో కేవలం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఏదైనా ఒక ఆట మాత్రమే ఆడేందుకు వీలుగా ఉంది. ఊరికి దూరంగా, పాఠశాలల్లో ఆడుకోమ్మని చెబితే ఎలా ఆడుకోవాలని యువకులు ప్రశ్నిస్తున్నారు.



ముళ్ల పొదలతో నిండిన వాలీబాల్ కోర్టు

సమస్యలను గుర్తించి పరిష్కరిస్తాం



జిల్లాలోని క్రీడా ప్రాంగణాల సమస్యలను పరిష్కరిస్తాం. మైదానాల్లో దట్టంగా పెరిగిన ముళ్ల పొదలు, గడ్డి వీలైనంత త్వరగా తొలగించి చదును చేయిస్తాం. క్రీడాకారులు ఆందోళన చెందనవసరం లేదు. ప్రభుత్వం కూడా గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తుంది.

– జయదేవ్ ఆర్య, డీఆర్‌డీఓ, సిద్దిపేట

నిధులు మంజూరు చేయండి



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న జీపీ కార్యదర్శులు

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామ పంచాయతీలకు నిధులు లేక నిర్వహణకు ఇబ్బంది పడుతున్నట్లు గ్రామ పంచాయతీల సంఘం ఉమ్మడి మండల అధ్యక్షుడు ఫహీం అన్నారు. గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఉమ్మడి మండల జీపీ కార్యదర్శులు ఎంపీడీఓ గంగుల గణేష్‌రెడ్డిని మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని 20 గ్రామ పంచాయతీలకు గతకొన్ని నెలలుగా రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు (ఎస్ఎఫ్‌సీ), కేంద్ర ఆర్థిక సంఘం నిధులు (15వ ఫైనాన్స్) జమ కానందున గ్రామ పంచాయతీల నిర్వహణ భారంగా మారిందన్నారు. గ్రామ పంచాయతీల ట్రాక్టర్ల నిర్వహణ, డీజిల్ చార్జీలు, కరెంటు బిల్లు, వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్య నిర్వహణ, గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది జీతాలు చెల్లించలేక నానా అగచాట్లు పడాల్సి వస్తుందన్నారు. అప్పులు చేసి పంచాయతీల్లో పనులు చేస్తున్నామన్నారు. జీపీ కార్యదర్శులకు వచ్చే అరకొర జీతాలతో గ్రామ పంచాయతీల నిర్వహణతో ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. తమ సమస్యలను దృష్టిలోపెట్టుకొని గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు మమత, రవీందర్, అశోక్, ప్రశాంత్, నవీన్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న గోపాలస్వామి

సిద్దిపేటఅర్బన్: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించడంతో పాటు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి, గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గోపాలస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నుంచి తొమ్మిది నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి తునికి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రావీణ్యం సాధించాలి



మెడిసిన్ బాల్ విసురుతున్న విద్యార్థి

హెచ్‌ఎం వాసుదేవ రెడ్డి

హుస్నాబాద్: ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పరీక్షలు నిర్వహించారు. వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్ త్రో, షటిల్ రన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ ఎంపిక పోటీల్లో 16 మంది బాలురు, ముగ్గురు బాలికలు హాజరైనట్లు తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 27వ తేదీన జిల్లాస్థాయి ఎంపిక పోటీలు సిద్దిపేట డిగ్రీ కళాశాల స్టేడియంలో నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో రాణిస్తే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీడీలు శ్రీనివాస్, శౌరిల్, పీఈటీలు కళావతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధికార ప్రతినిధుల నియామకం



అధికార ప్రతినిధులతో మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధులుగా ఇద్దరు నియమితులయ్యారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధికార ప్రతినిధులుగా అయిలేని మల్లికార్జున్ రెడ్డి, సుద్దాల చంద్రయ్యను మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ నియమించారు. పార్టీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తామన్నారు.

ఏబీవీపీ సిద్దిపేట నగర నూతన కమిటీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఏబీవీపీ సిద్దిపేట నగర కార్యదర్శిగా పర్శారాం నియమితులయ్యారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలో ఏబీవీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట నగర కమిటీని నియమించారు. నగర సంయుక్త కార్యదర్శులుగా రాకేష్, మారుతి, ఉపాధ్యక్షులుగా నందు, ఫణీందర్, సోషల్ మీడియా కన్వీనర్‌గా అనీష్, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్‌గా అభిరామ్ నియమితులయ్యారు. ఈ మేరకు వారికి ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులు బీరకాయల వివేక్‌వర్ధన్, సిద్దిపేట సంఘటన మంత్రి లక్ష్మీపతి నియామక పత్రం అందజేశారు.

బాధితులకు పరామర్శ



మృతుల కుటుంబాలను ఓదారుస్తున్న చాడ వెంకట్

హుస్నాబాద్: ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను మంగళవారం సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి పరామర్శించారు. డాక్టర్ బొద్దున రంగయ్య మరణించడం ఎంతగానో కలిచి వేసిందన్నారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఎల్లమ్మ దేవాలయం కమిటీ చెర్మన్ పూదరి లక్ష్మీనారాయణ గౌడ్ తల్లి వజ్రమ్మ కుటుంబాలను పరామర్శించారు.

మత్తు పదార్థాలను నిర్మూలించాలి



సిద్దిపేటలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించాలని సిద్దిపేట వన్‌టౌన్ సీఐ లక్ష్మీబాబు అన్నారు. ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తుపదార్థాల వినియోగం అనర్థాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వాడకంతో కలిగే నష్టాలు, నివారణ మార్గాలపై వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.

వ్యాసరచన పోటీలు

వర్గల్(గజ్వేల్): ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా మంగళవారం విద్యార్థులకు వర్గల్ మండలం గౌరారం పోలీసులు మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి విద్యార్థులకు గంజాయి, మత్తుపదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలు వివరించారు.

అలిరాజ్‌పేటలో..

జగదేవ్‌పూర్(గజ్వేల్): మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా మంగళవారం మండలంలోని అలిరాజ్‌పేటలో ఓ పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల అనర్థాలపై ఎస్‌ఐ చంద్రమోహన్ అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

చెడు వ్యసనాలకు దూరంగా..

మద్దూరు(హుస్నాబాద్): చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఏఎస్‌ఐ జగదీశ్వర్ అన్నారు. మంగళవారం ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. బహుమతులు పొందిన విద్యార్థులకు బుధవారం సర్టిఫికెట్స్ అందజేస్తామన్నారు.

మత్తు పదార్థాలతో..

హుస్నాబాద్: మత్తు పదార్థాల వాడకంతో జీవితాలు నాశనమవుతాయని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శివరంజని అన్నారు. మంగళవారం పట్టణంలోని సీవీ రామన్ హైస్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏజీపీ కన్నోజు రామకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, ప్రధానోపాధ్యాయుడు కాయిత నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్ అనర్థాలపై ..

నంగునూరు(సిద్దిపేట): మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినం పురస్కరించుకొని మంగళవారం నంగునూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బహుమతులు పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తామని రాజగోపాల్‌పేట ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

కొమురవెల్లి(సిద్దిపేట): అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏఎస్‌ఐ రామూర్తి ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు మంగళవారం నిర్వహించారు.

మాదకద్రవ్యాలపై..

దుబ్బాకటౌన్: దౌల్తాబాద్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు మాదకద్రవ్యాలు, గంజాయి, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై ఎస్‌ఐ ప్రేమ్‌దీప్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు.

వేతన బకాయి చెల్లించాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు వెంటనే వేతనాలు అందించాలని కోరుతూ మంగళవారం మండల కార్యాలయంలోని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు ఎంపీడీఓ యాదగిరికి వినతి పత్రం అందజేశారు.

సమస్యలు పట్టించుకోవడం లేదు

తొగుట(దుబ్బాక): దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రజల సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని బీజేపీ మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం ఆరోపించారు. బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేగా గెలిచి నాటి నుంచి ప్రజలకు అందుబాటులో ఉండటంలేదన్నారు. మండలంలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ చేకుండా అధికార పార్టీ నాయకులు అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. మూడు రోజుల్లో చెక్కుల కాలపరిమితి ముగుస్తుందన్నారు. చెక్కులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అవినీతిపై చర్చకు రండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అవినీతి, అక్రమాలపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు చర్చకు రావాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేశామన్నారు. కొంత మంది బీఆర్ఎస్ నాయకులు కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట ప్రధాన కార్యదర్శి మధు, సిద్దిపేట యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గయాజుద్దీన్, ఎన్ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతన జీవో విడుదల చేయండి

ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఇన్‌చార్జి లచ్చయ్య



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

దుబ్బాక: బీడీ కార్మికుల కనీస వేతన జీవో విడుదల చేయాలని ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఇన్‌చార్జి తడక లచ్చయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం భారత కార్మిక సంఘాల సమాఖ్య పిలుపు మేరకు దుబ్బాక తహసీల్దార్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టాక కార్మిక వ్యతిరేక విధానాలను వేగవంతం చేసిందన్నారు. ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న అన్ని కేటగిరీల కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. 14 ఏళ్లు గడుస్తున్నా కార్మికుల వేతన జీవో ఇవ్వలేదని ఆరోపించారు. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఐకమత్యంగా పోరాడుతామన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ దరఖాస్తు చేసుకోండి

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్ పోస్టు కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పద్మలత తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ పాఠశాలలో 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఇంగ్లీష్ బోధనకు టీచర్ పోస్టు ఖాళీగా ఉందని, ఎంఏ, బీఈడీ చేసిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలన్నారు.

◆ ఇసుక డంపుల వేలం

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలో రెండు చోట్ల సీజ్ చేసిన ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు మంగళవారం వేలం వేశారు. ఇసుకను దక్కించుకోవడానికి పలువురు పోటీ పడ్డారు. మిరుదొడ్డికి చెందిన వల్లకొండ సంజీవ రెడ్డి రెండు ఇసుక డంపులను రూ.58 వేలకు వేలం పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో మిరుదొడ్డి ఎస్‌ఐ బోయిని పర్శరాములు, ఆర్ఐలు రాజ్‌కుమార్, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ కోహెడ పాలకేంద్రం కార్యవర్గం ఎన్నిక

కోహెడ(హుస్నాబాద్): కోహెడ పాలకేంద్రం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బండ సమస్, సభ్యులుగా గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, మంద శంకర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పెర్యాల నర్సింగరావు, ముంజ రాజేందర్, గంగం సంతోష్‌రెడ్డి, తలారి ప్రభాకర్, దనబోయిన రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ విగ్రహావిష్కరణకు తరలిరండి

చేర్యాల(సిద్దిపేట): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి జూలై 4వ తేదీన జనగామ పట్టణ కేంద్రంలోని క్లాం రోడ్డు కమాన్ వద్ద ఏర్పాటు చేసిన కొమురయ్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేర్యాల ప్రాంత కురుమలు విజయవంతం చేయాలని ఆ సంఘం జనగామ పట్టణ గౌరవాధ్యక్షుడు మోటే శ్రీశైలం పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక బీరప్ప దేవాలయం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

◆ మద్దూరు ఎస్సై బదిలీ

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు మండల ఎస్సై షేక్ యునస్ అహ్మద్ అలీ మంగళవారం బదిలీ అయ్యారు. ఎన్నికల నేపథ్యంలో బదిలీలో భాగంగా మద్దూరు పోలీస్‌స్టేషన్ వచ్చారు. ఈయనను కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి బదిలీ చేస్తూ సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ సీపీ అనురాధ ఉత్తర్వులు జారీ చేశారు.

◆ బస్సు సౌకర్యం కల్పించాలి

సిద్దిపేటకమాన్: తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ కొమురవెల్లి, రాంసాగర్ గ్రామ ప్రజలు సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సుఖేందర్‌ను కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో సిద్దిపేట నుంచి కొమురవెల్లి, రాంసాగర్, రాజపేట, జగదేవ్‌పూర్ మీదుగా ఈసీఐఎల్ వరకు బస్ సర్వీసు నడిచిందని, ప్రస్తుతం నిలిపివేశారన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం మళ్లీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరారు. డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్తులు తెలిపారు.

◆ రెండోరోజు కొనసాగిన పరీక్ష

సిద్దిపేటఅర్బన్: ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ నియామక పరీక్ష రెండో రోజు కొనసాగింది. ఆన్‌లైన్ విధానంలో ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు నిర్వహించిన పేపర్1కు 74 మంది, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు నిర్వహించిన పేపర్ 2 పరీక్షకు 74 మంది హాజరయ్యారు. 52 మంది గైర్హాజరయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు, అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్, అబ్జర్వర్ శ్రీలత, టీసీఎస్ ఆఫీసర్ సాయిలీల, పీఆర్వో రఘు, సిస్టం అడ్మిన్ షాదుల్లా పర్యవేక్షించారు.

◆ సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం

చేర్యాల(సిద్దిపేట): ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తున్నట్లు ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మంగళవారం మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు, కౌన్సిలర్ ఆడెపు నరేందర్ పాల్గొన్నారు.

◆ గుట్కా ప్యాకెట్ల పట్టివేత

దుబ్బాక: దౌల్తాబాద్‌లోని నాగమల్లి భాస్కర్ కిరాణ దుకాణంలో ప్రభుత్వం నిషేధించిన గుట్కా ప్యాకెట్లు అమ్ముతున్నారన్న సమాచారం మేరకు మంగళవారం సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, దౌల్తాబాద్ పోలీసులు దాడిచేసి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీరాం ప్రేమ్‌దీప్ తెలిపారు. గుట్కాల్, అంబార్, బ్లూబుల్ టోబాకో ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తించి విక్రేతపై కేసు నమోదు చేశామన్నారు.

◆ ఎంపీకి శుభాకాంక్షలు

చేర్యాల(సిద్దిపేట): భువనగిరి ఎంపీగా మంగళవారం ప్రమాణ స్వీకారం చేసిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో మాజీ జెడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఉడుముల బాల్‌రెడ్డి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ కాటం మల్లేశం, వీరన్నపేట మాజీ సర్పంచ్ కొండపాక భిక్షపతి, నాయకులు ఉన్నారు.

◆ ఎంపీని కలిసిన నాయకులు

ప్రశాంత్ నగర్ (సిద్దిపేట): లోక్‌సభ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావును ఢిల్లీ వెస్ట్రన్ కోర్టులో బీజేపీ జిల్లా నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో విద్యాసాగర్, విభీషణ్‌రెడ్డి తదితరులు ఉన్నారన్నారు.

◆ ఇన్‌చార్జి ఎంఈఓకు సన్మానం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి ఇన్‌చార్జి ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన యాదవరెడ్డిని మంగళవారం బెజ్జంకి స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. కార్యక్రమంలో శ్రీరాములు, గోపికృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.